epaper.manachourasta.com

# మన చౌరాస్తా

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 49 | శనివారం, 17 జనవరి 2026 | పేజీలు : 05





## కాంతులీనుతున్న..
# వీరన్న క్షేత్రం

- కొనసాగుతున్న కొత్తకొండ జాతర

3, 4వ పేజీల్లో..




### రిజిస్ట్రేషన్లలో రూ.3.90 కోట్లు
## స్వాహా చేసిన ఘనులు

- ధరణి, భూభారతి నిందితుల అరెస్టు
- సర్కారు ఆదాయానికి గండి కొట్టిన 15 మంది
- పరారీలో మరో 9 మంది పరారీ
- రూ.63.19 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

5లో



2లో

### వరద ప్రభావిత ప్రాంతాల్లో
## కేంద్ర బృందం పర్యటన

# వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటన

■ మొంథా తుఫాన్ నష్టాలపై ఆరా

**వరంగల్, మన చౌరాస్తా :** మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న నష్టాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమగ్ర నష్టం అంచనా నివేదిక రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వ బృందం శుక్రవారం జిల్లాలో పర్యటించింది. ఈ బృందం వరంగల్ జిల్లా తో పాటు వరంగల్ నగర జిడబ్ల్యుఎంసి పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి తుఫాన్ వల్ల జరిగిన నష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించింది. నలుగురు ప్రతినిధులు పొన్ను స్వామి, నిశాంత్ మిశ్రా, శశివర్ధన్, రాహుల్ బఖేటిలతో కూడిన కేంద్ర బృందం, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహాత్ బాజ్పాయితో కలిసి వరంగల్ నగరంలోని ఎన్ ఎన్ నగర్, ఎన్టీఆర్ నగర్, మైసయ్య నగర్ కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా నీట మునిగిన ఇళ్లను, గృహాలకు వాటిల్లిన నష్టం, వాహనాలు, ఇంటి సామగ్రికి జరిగిన నష్టం, నీట మునిగిన ట్రాన్స్ఫార్మర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాల ప్రాంతాలను పరిశీలించింది. తుఫాన్ వల్ల జరిగిన నష్టాలపై అధికారులను, స్థానికులను అడిగి వివరాలు సేకరించింది. అదేవిధంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని చంద్రుగొండ, బొగ్గులకుంట తండా, దీక్ష కుంట గ్రామాల్లో పర్యటించిన కేంద్ర బృందం, తుఫాన్ ప్రభావంతో ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలకు జరిగిన నష్టం, నీట మునిగిన వరి పంటలు, దెబ్బతిన్న పంట పొలాలు, పశువుల నష్టం, దీక్ష కుంటలో కూలిపోయిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని పరిశీలించింది. తుఫాన్ కారణంగా ఎదురైన పంట నష్టాలపై స్థానిక రైతులు కేంద్ర బృందానికి వివరించారు. కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, ఎన్ పిడిసిఎల్ ఎస్ ఈ గౌతమ్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలరాజు, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి, జిడబ్ల్యుఎంసి ఎస్ ఈ సత్యనారాయణ, ఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## హుస్నాబాద్‌లో..

**హుస్నాబాద్, మన చౌరాస్తా:** అక్టోబర్ నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం హనుమకొండ జిల్లాలో భీమదేవరపల్లి మండలం కొప్పూరు విశ్వనాథ కాలనీ గ్రామాల్లో శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టం పై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొన్నుస్వామి నేతృత్వంలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. దేవునూరు నుండి ముప్పారం గ్రామం మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి సమీపంలో పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షాల కారణంగా తోట కమలమ్మ కు చెందిన ఇల్లు కూలిపోగా ఆ ఇంటిని పరిశీలించి ఆ మహిళతో మాట్లాడారు. కొప్పూరులో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు. కేంద్ర బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి అధికారులు గోపికృష్ణ, ఉదయ్ పాల్గొన్నారు.










## మల్లన్న దర్శించుకున్న గిరిజన శాఖ మంత్రి

**కొమురవెల్లి మన చౌరాస్తా :** ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీ కొమరవెల్లి మల్లికార్జునస్వామిని రాష్ట్ర షెడ్యూలు కులాల అభివృద్ధి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్నకు పట్నం, బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. మల్లన్న పూజ అనంతరం అర్చకులు ఆశీర్వచనం అందించారు. స్వామివారి శేష వస్త్రం, వేద ఆశీర్వచనము మరియు చిత్రపటాన్ని ప్రసాదం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మల్లన్న దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో టంకశాల వెంకటేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ గంగం నరసింహారెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నీలా చంద్రశేఖర్, కొమరవెల్లి పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు సార్ల లింగం, బొచ్చు ఎల్లయ్య, ఎలుగల మల్లేశం, వంగరి వరలక్ష్మి, నాగరాజు బాలయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆకునూరు గ్రామ సభలో సమస్యలపై తీర్మానం

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని ఆకునూరు గ్రామంలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం సర్పంచ్ కొమ్ము రవి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పలు సమస్యలపై తీర్మానం చేశారు. వార్డుల వారిగా సమస్యలను వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకురావడంతో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్లు, త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ షెట్టర్లు వేలం పాట నిర్వహిస్తామని, రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారిని వెడల్పు చేయాలని సభ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. తదితర సమస్యలపై గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొయ్యడ సందీప్, ఉప సర్పంచ్ కదారి పల్లవి, వార్డు సభ్యులు నూనె శేఖర్, అందే లక్ష్మి, సూర అనిత, జూపల్లి కార్తీక్ రెడ్డి, తాటికొండ శేఖర్ యాదవ్, ఎండి.హైమద్, భూమని భాస్కర్, గణపురం బాల నరసమ్మ, సుంచు హేమ, మంతపురి భాగ్య, గ్రామ పెద్దలు పందిళ్ళ నర్సయ్య, వెలుగల రఘువీర్, అందే అశోక్, గడిపే బాల నరసయ్య, ముచ్చాల శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గాదె ఇన్నయ్యకు మాతృవియోగం

**వరంగల్, మన చౌరాస్తా :** సామాజిక ఉద్యమకారుడు, మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్య ఇంట్లో విషాదం నెలకొంది. ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూశారు. అనారోగ్య సమస్యలు, వయోభారంతో ఇబ్బంది పడుతున్న ఆమె గురువారం రాత్రి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరంలోని సొంతింట్లో తుదిశ్వాస విడిచారు. శనివారం నాడు ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని సమాచారం. మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్యను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు డిసెంబర్‌లో అరెస్ట్ చేశారు. ఇన్నయ్య జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో 'మా ఇల్లు ప్రజాదరణ' ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్ఐఏ అధికారులు .. ఆశ్రమానికి చేరుకుని మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్నయ్య హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

# కొత్తకొండ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- వీరభద్ర స్వామి ఆలయానికి రూ.70 కోట్లు
- దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రాష్ట్రంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆమె, రాష్ట్ర రవాణా-బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, భద్రకాళి నుంచి బాసర వరకు ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధంగా ఉందని, వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. భక్తుల సౌకర్యార్థం వసతి, దర్శన ఏర్పాట్లు, పారిశుద్ధ్యం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. జాతరను ప్లాస్టిక్ రహితంగా నిర్వహించాలన్న సూచనలు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కోరమీసాల వీరభద్ర స్వామి ఆలయాన్ని భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఈఓ కిషన్ రావు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.








# వీరభద్రుడికి ఘనంగా పుష్పయాగం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ప్రసిద్ధ కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పుష్పయాగాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించగా, భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుండి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వీరభద్రస్వామికి పుష్పయాగం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని పూజిస్తూ, భక్తులు తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు. పుష్పయాగంలో పాల్గొనడం వల్ల సకల దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని పండితులు తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ ఈఓ కిషన్ రావు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి యాగానికి శాస్త్రోక్తంగా నిర్వహణ చేపట్టారు. పుష్పయాగంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, భద్రతా చర్యలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమం భక్తుల మనసుల్లో ఆధ్యాత్మిక శాంతిని నింపుతూ కొత్తకొండ బ్రహ్మోత్సవాలకు మరింత శోభను చేకూర్చింది.

# వీరన్న జాతరలో కొత్తపల్లి రథాల వైభవం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** డప్పు చప్పులు, సంప్రదాయ ఊరేగింపులతో భక్తులను ఆకట్టుకున్న రథోత్సవం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో నిర్వహిస్తున్న శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామి (వీరన్న) జాతరలో కొత్తపల్లి గ్రామ రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తరతరాలుగా కొనసాగుతున్న ఈ రథోత్సవం గ్రామీణ సంప్రదాయం, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. వీరన్న జాతరలో భాగంగా మొదటి రథం బ్రాహ్మణ పెద్దదొర గడి నుంచి ప్రారంభమైంది. మురళి సీరియల్ నెంబర్ ప్రకారం ఒకటో నెంబర్ నుంచి చివరి నెంబర్ వరకు అన్ని రథాలను క్రమబద్ధంగా అమర్చారు. ఊరేగింపునకు ముందుగా రథాలను పోచమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం గడి నుంచి వరుస క్రమంలో రథాలు బయలుదేరాయి. డప్పు చప్పులు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ సాగిన రథయాత్ర అధ్యంతం భక్తులను ఆకట్టుకుంది. గ్రామ వీధులన్నీ భక్తులతో కిటకిటలాడగా, సంప్రదాయ వాయిద్యాల నాదాలతో జాతర వాతావరణం ఆధ్యాత్మికంగా మార్మోగింది. రథాలను లాగితే పంటలు పండుతాయని, కుటుంబాల్లో శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. కొత్తపల్లి గ్రామానికి చెందిన సంప్రదాయ వడ్రంగులు, శిల్పకారులు ఈ రథాలను శాస్త్రోక్తంగా తయారు చేయడం మరో ప్రత్యేకత. ఆధునిక యంత్రాలు వినియోగించకుండా పూర్తిగా చేతి పనితో నిర్మించిన రథాలు శిల్పకళకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. రథాలపై చెక్కిన కళాత్మక రూపాలు, వీరభద్ర స్వామి మహిమను ప్రతిబింబించే చెక్క శిల్పాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీరన్న జాతర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి రథోత్సవాన్ని తిలకించారు. కొత్తపల్లి రథాలు కేవలం జాతరలో భాగంగా మాత్రమే కాకుండా, గ్రామీణ సంస్కృతి, సంప్రదాయ వారసత్వాన్ని తరతరాలకు అందించే గొప్ప ఆధ్యాత్మిక కార్యక్రమంగా నిలుస్తున్నాయి.





# భక్తులకు అందుబాటులోకి వాటర్ ప్లాంట్

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తన ఎంపీ లాడ్స్ నిధుల నుంచి వాటర్ ప్లాంట్ మంజూరు చేశారు. గత కొన్ని రోజులుగా టెక్నికల్ ప్రాబ్లమ్స్ వల్ల వాటర్ ప్లాంట్ ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. దేవస్థానం నుంచి దాన్ని మరమ్మతులు చేయించి ఇప్పుడు భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దేవస్థాన పాలకమండలి, మండల కాంగ్రెస్ పార్టీ తరపున కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.



# కిటకిటలాడిన కొత్తకొండ






















# రిజిస్ట్రేషన్లలో రూ.3.90 కోట్లు స్వాహా

- ధరణి, భూభారతి నిందితుల అరెస్టు
- సర్కారు ఆదాయానికి గండి కొట్టిన 15 మంది
- పరారీలో మరో 9 మంది
- రూ.63.19 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుకొండ, మన చౌరాస్తా :** రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతి రిజిస్ట్రేషన్లలో రూ.3.90 కోట్ల కుంభ కోణంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో ఉన్నారు. ఈ ముఠా సభ్యుల నుంచి పోలీసులు రూ.63.19 లక్షల నగదు, బ్యాంక్‌ల్లో 1లక్ష రూపాయలు, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్లు, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## అరెస్టు అయిన వారు వీరే..

పోలీసులు అరెస్టు చేసిన వారిలో యాదాద్రి జిల్లాకు చెందిన పసునూరి బసవ రాజు, జెల్లా పాండ, మహేశ్వరం గణేష్ కుమార్, జనగామ జిల్లాకు చెందిన ఈగజులపాటి శ్రీనాథ్, ఎనగంధుల వెంకటేష్, కోదురి శ్రావణ్, కొలిపాక సతీష్ కుమార్ (కొడకండ్ల (ఎం), తడూరి రంజిత్ కుమార్, దుంపల కిషన్ రెడ్డి, (ఆత్మకూర్ (ఎం), యాదాద్రి), దశరథ మేఘావత్ (తురుపల్లి), నారా భాను ప్రసాద్(యాదగిరిగుట్ట), గోపగాని శ్రీనాథ్, శివ కుమార్( అమంగల్, నల్లగొండ), అలేటి నాగరాజు( యాదాద్రి జిల్లా) ఉన్నారు. ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడించారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో అన్లైన్ సర్వీస్ నిర్వహించే వారు. ఇందులో నిందితుల్లో ఒకరైన గణేష్ తనకు తాను అన్‌లైన్ సెంటర్లతో పరిచయం చేసుకొని చెల్లించాల్సిన మొత్తాన్ని ఎన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుంచి ఆన్‌లైన్ సర్వీస్ వ్యక్తులకు, మధ్య వర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణి, భూభారతి వెబ్ సైట్లో ఇన్స్పెక్ట్ " ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుం తగ్గించేవాడు. అనంతరం అట్టి చలాన్‌ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడు. ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుంను మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయములో మధ్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొదుతూ మోసాలకు పాల్పడేవారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మధ్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణి, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారు. ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30 శాతం వరకు కమిషన్ చెల్లించే వారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబంధించిన లావాదేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభ కోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయి. ఇందులో జనగామ జిల్లాలో 7 కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ఈ ముఠా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి చేతన్, జనగామ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, రఘునాథపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఎస్సైలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.



# అ'పూర్వ' సమ్మేళనం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను, పాఠశాల రోజుల్లో ఎదుర్కొన్న అనుభవాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. అప్పటి ఉపాధ్యాయులు, స్నేహితులతో గడిపిన మధుర క్షణాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కావేరి సీడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ, ప్రతి వ్యక్తి జీవితంలో కష్టం తప్పనిసరి అని, ఆ కష్టాన్ని నమ్ముకుని ముందుకు సాగితే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మనలోని తెలివితేటలు, ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన సూచించారు. విద్యార్థి దశలో ఏర్పడిన క్రమశిక్షణే జీవితంలో విజయానికి పునాది అవుతుందని తెలిపారు. ఈ సమ్మేళనాన్ని బానోత్ సురేష్ నాయక్ సమర్థవంతంగా నిర్వహించి అందరినీ ఒక్కచోట చేర్చి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. కార్యక్రమంలో సంపత్, రవీంద్ర చారీ, మధ్యల ఐలయ్య, అశోక్, రామారావు, శ్రీనివాస్, రవి, రాజేశ్వర్ రావు, మంగ, ప్రేమలత, స్వర్ణలత, కోమలత, ధనలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొనన్నారు.




# మైనార్టీ పాఠశాల కళాశాల అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని ముస్లిం మైనారిటీలందరూ స్కూల్, ఇంటర్మీడియట్ కళాశాలలో మైనారిటీ రెసిడెన్షియల్ అడ్మిషన్ల కోటను సద్వినియోగం పరుచుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. మైనారిటీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్ ను ఆయన శుక్రవారం కలెక్టరేట్లో విడుదల చేశారు. జిల్లాలోని ఒక బాలుర (జనగామ) లో, ఒక బాలికల (స్టేషన్ ఘన్పూర్)లోని పాఠశాల, కళాశాలలో గల సీట్లలో 80 శాతం మైనారిటీలకు, 20 శాతం నాన్ మైనార్టీలకు సీట్స్ అందుబాటులో ఉన్నాయని, పాఠశాలల్లో ఐదవ తరగతి, కళాశాలలో ప్రథమ సంవత్సరంలో నూతన అడ్మిషన్లతో పాటు ఆరవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో బ్యాక్లాగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ విక్రమ్ కుమార్, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ కే. కుమారస్వామి, కళాశాల ప్రిన్సిపల్ పి.అనిల్ బాబు అధ్యాపకులు తాయినాత్ సగీరా, పెట్లోజు సోమేశ్వరా చారి, రెహానా వార్డెన్ సల్మాన్,ఫసి పాల్గొన్నారు.

## 'క్యూ న్యూస్' క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ కలెక్టరేట్ లో క్యూ న్యూస్ జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గండి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రజల సమస్య లను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తుంది క్యూ న్యూస్ అని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా మీడియా రంగంలోని క్యూ న్యూస్ కృషి చేయడం ఎంతో హర్షనీయమ న్నారు. అనంతరం జనగామ డీసీపీ బి.రాజమహేంద్ర నాయక్ న్యూస్ కాలెండర్ ఆవిష్కరించా రు. కార్యక్రమంలో రిపోర్టర్లు జితేందర్, బక్క రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# బోనమెత్తిన ఎర్రబెల్లి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండలం బొమ్మెర గ్రామంలో ఘనంగా నిర్వహించిన శ్రీఆలేటి ఎల్లమ్మ జాతరలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి బోనమెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. జాతర ప్రాంగణంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు రాకను చూసిన మహిళలు ఆనందోత్సాహాలతో ఆయనను ఆప్యాయంగా పలకరించారు. కంకణం కట్టి తమ భక్తి, సంతోషాన్ని వ్యక్తం చేశారు. అమ్మవారి జాతర వాతావరణం భక్తితో, సంప్రదాయ ఉత్సాహంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రాం రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ నాయక్‌తో పాటు ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**